సాక్షి నిజామాబాద్

సోమవారం । 14 । జూలై । 2025



23 దేశాల కరెన్సీ..

డిచ్‌పల్లి బెటాలియన్ కానిస్టేబుల్ గంగాధర్ విదేశీ కరెన్సీ, నాణేలు, స్టాంపులను సేకరిస్తున్నారు.

- 8లో ▸



బోనస్ కోసం రైతుల నిరీక్షణ

యాసంగిలో సన్నరకం వరి సాగు చేసి కొనుగోలు కేంద్రంలో అమ్మిన రైతులు బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.6 /23.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నాగారంలో చిరుత సంచారం



నిజామాబాద్ సిటీ: నగరంలోని నాగారం శివారులో ఆదివారం చిరుత సంచరించింది. సాయంత్రం 6 గంటల సమయంలో డంపింగ్ యార్డు సమీపంలోని 300 క్వార్టర్స్ కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద చిరుతపులిని స్థానికులు గమనించారు. కొందరు తమ ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు తీశారు. కాలనీ సమీపంలోకి చిరుత రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదని తెలిపారు.

స్కూల్ తండా ప్రాంతంలో పులి సంచారం!

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండా ప్రాంతంలో పులి సంచరిస్తోందంటూ స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మూడు రోజుల క్రితం ఆవుపై దాడి చేసి చంపిందని పేర్కొంటున్నారు. స్కూల్ తండా శివారు నుంచి నిజామాబాద్ జిల్లా ప్రారంభం అవుతుంది. కొండాపూర్, సిరికొండ అటవీ ప్రాంతం, తూంపల్లి అటవీ ప్రాంతం నుంచి పులి వచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పులి సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో మైక్‌ల ద్వారా, వాట్సాప్ గ్రూప్‌ల్లో ప్రచారం చేస్తున్నారు. పులి సంచారంపై మాచారెడ్డి ఎఫ్‌ఆర్‌వో దివ్యను వివరణ కోరగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి పులి వచ్చినట్లు తెలుస్తోందన్నారు. దాని ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలోని 11కేవీ గాయత్రి ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్‌లో 33 కేవీ టవర్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గాయత్రినగర్ ఫీడర్ పరిధిలోని కామాక్షి నిలయం, సాయి నిలయం, మీనాక్షి పద్మావతి అపార్ట్‌మెంట్, భవానీనగర్, డీటీఆర్ ఎస్ఎస్-9, 10, 11, 12, 16, 22, 33లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆర్ చంద్రశేఖర్ కోరారు.

ఘనంగా శ్రీవారి శ్రవణ నక్షత్ర కల్యాణం



నస్రుల్లాబాద్(బీర్కూర్): మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి వారికి శ్రవణ నక్షత్ర కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, లక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తుల మీదుగా వెళ్తున్న గ్రామదేవతల తొట్టెలు



ఊరేగింపుగా తరలివస్తున్న అమ్మవారు



కదిలొచ్చిన అమ్మ



ఖిల్లా నుంచి ప్రారంభమవుతున్న శోభాయాత్ర

వైభవంగా ఊరపండుగ

- ఊరేగి.. గద్దెలకు చేరుకున్న అమ్మవార్లు
- డప్పు చప్పుళ్లు.. పోతరాజుల విన్యాసాలు
- హోరెత్తిన 'ఫులోరియా' నినాదాలు
- అడుగడుగునా గ్రామదేవతలను కొలిచిన నగరవాసులు
- వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, ఎమ్మెల్సీ బల్మూరి

నిజామాబాద్ రూరల్: గ్రామ దేవతలు కదిలొచ్చిన వేళ ఇందూరు నగరం పులకించింది. తమ తమ ప్రాంతాలను సల్లంగా కాపాడాలని కోరుతూ నగరవాసులు అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్ఠించారు. సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను నగరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖిల్లా రామాలయం వద్దనున్న శారదాంబ గద్దె నుంచి అమ్మవార్లు బయలెల్లగా.. ముందు వరుసలో 'సరి' గుల్ల ముందుకుసాగింది. కదిలొస్తున్న అమ్మవార్లను చూస్తూ తన్మయత్వంతో నగరవాసులు 'ఫులోరియా' అంటూ నినాదాలను హోరెత్తించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, తొట్లెల ఊరేగింపు, శివసత్తుల పూనకాలతో నగరవీధులు హోరెత్తాయి. శారదాంబ గద్దె నుంచి రాట్నం, చక్రం, పెద్దమ్మ, పొడాలమ్మ, మహాలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, కొండల రాయుడు, భోగస్వామి, సమ్మక్క, సరక్కలు తరలిరాగా.. పెద్ద బజార్, ఆర్యసమాజ్, జెండాగల్లి, వినాయక్‌నగర్, మహాలక్ష్మినగర్, దుబ్బ ప్రాంతాల వైపు శోభాయాత్ర కొనసాగింది. ఊరపండుగలో ప్రత్యేకమైన సరి(పదార్థం)ని భక్తులు ఇళ్లపై చల్లుకున్నారు. భక్తులు



అమ్మవారి ప్రతిమను తీసుకొస్తున్న భక్తులు

దారి పొడవునా యాటలను బలిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతలను పూజించారు. ఊరపండుగను పురస్కరించుకొని ఇందూరు నగరమంతా జన సంద్రంగా మారింది. శారదాంబ గద్దె వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బట్టు రాజేశ్వర్, కో కన్వీనర్ ఆదె ప్రవీణ్, నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.



సరి కోసం పోటీ పడుతున్న భక్తులు

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. తమ పూర్వీకులు కొండల రాయుడిని కొలిచేవారని, అప్పటి నుంచి తాము సైతం గ్రామదేవతలను కొలుస్తున్నామని తెలిపారు.

ఊర పండుగకు ఘన చరిత్ర

90 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇందూరు ఊర పండుగకు ఘనమైన చరిత్ర ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. పండుగను అన్నివర్గాల ప్రజలు కలిసికట్టుగా నిర్వహించడం హిందువుల ఐక్యతకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఐకమత్యాన్ని కొనసాగించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



ఖిల్లా వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్, శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: ఊర పండుగ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సీపీ సాయిచైతన్య స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. ఊరేగింపు కొనసాగిన ఖిల్లా చౌరస్తా, వివేకానంద చౌరస్తా, లక్ష్మి మెడికల్, గాజుల్‌పేట్ , పెద్దబజార్, గోల్‌హనుమాన్, ఫులాంగ్ చౌరస్తా, ఆర్యనగర్, వినాయక నగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వివేకానంద చౌరస్తా వద్ద సరి తీసుకునే క్రమంలో భక్తుల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు కట్టడి చేశారు. సీపీ వెంట ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.



గోల్‌హనుమాన్ వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయిచైతన్య

గిఫ్ట్ కొంత.. కబ్జా మరింత

- నవీపేటలో అసైన్డ్ ల్యాండ్ పంచాయితీ
- సెటిల్ చేసిన మధ్యవర్తులకు కొంత భూమి గిఫ్ట్
- దాని పక్కనే కాలువను కబ్జా చేస్తున్న మధ్యవర్తులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

నవీపేట: భూ వివాదానికి సంబంధించిన పంచాయితీలో గిఫ్ట్‌గా వచ్చిన స్థలం సరిపోదనుకున్న కబ్జాదారులు దాని పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలంపై కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో అధికారురులెవరూ అటువైపు చూడరని భావించి నవీపేట మండల కేంద్రంలోని బాసర రహదారి పక్కన ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని చదును చేసి మొరం భర్తీ వేశారు. ఇదేమిటని ప్రశ్నించిన స్థానికులను కబ్జాదారులు బెదిరించడం గమనార్హం.



నవీపేటలో ఇరిగేషన్ కాలువ పక్కన స్థలాన్ని ఆనుకుని మొరం నింపిన దృశ్యం

నవీపేటకు చెందిన దాయాదుల మధ్య ఏళ్లుగా ఉన్న అసైన్డ్ భూమి పంచాయితీని కొందరు వ్యక్తులు సెటిల్ చేశారు. దీంతో సదరు దాయాదులు ఆ వ్యక్తులకు కొంత భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారు. వారు గిఫ్ట్ ఇచ్చిన స్థలం సరిపోదని అనుకున్నారో ఏమో కానీ పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువ స్థలాన్ని దానిలో కలుకోవాలని భావించారు. వెంటనే మొరం వేయించి చదును చేశారు. కబ్జాకు గురవుతున్న కాలువ స్థలం విలువ సుమారు రూ. కోటి వరకు ఉంటుందని అంచనా. వర్షం నీరు దర్యాపూర్ చెరువులోకి ప్రవహించే కాలువను కబ్జా చేస్తున్నారు. దీంతో వందల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే కాలువ ఆనవాళ్లు కోల్పోతోందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ కబ్జాను అడ్డుకోకపోతే ఆందోళన చేపడతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నవీపేటలోని సాగునీటి కాలువ పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమించినట్లు ఫిర్యాదు అందింది. కాలువను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో అక్కడికి వెళ్లి విచారిస్తాం. మొరం భర్తీ పనులను ఆపాలని సంబంధిత వ్యక్తులకు ఆదేశాలిచ్చాం.

– బలరామ్, ఈఈ ఇరిగేషన్, నిజామాబాద్

ఈ ఏడాదీ అవే కష్టాలు



పెద్దమావంది గ్రామ సమీపంలో పసుపు వాగు వద్ద నిలిచిన హైలెవల్ వంతెన పనులు

- నిధులున్నా ఆగిన పెద్దమావంది వాగు వంతెన పనులు
- సకాలంలో పనులు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు

బోధన్: బోధన్ మండలంలోని పెద్దమావంది రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేలా లేవు. వాగు దాటి పంటలు సాగు చేసేందుకు నిత్యం 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి. వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిధులు మంజూరు చేసినా సకాలంలో పనుల ప్రక్రియ మొదలు పెట్టకపోవడం దశాబ్దాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమావంది గ్రామ అంచున ఉన్న పసుపు వాగుపై పదేళ్ల క్రితం రూ. 3.50కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం ప్రారంభించారు. మొదట కాలయాపన జరగడంతో అంచనా వ్యయం పెరిగింది. దీంతో 9 పిల్లర్ల మేరకు స్లాబ్ పనులు పూర్తిచేసి అలాగే వదిలేశారు.

అదనపు నిధులు మంజూరు చేయించినా..

స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో 2024–25 సీఆర్ఆర్ కింద రూ.కోటీ 44 లక్షల అదనపు నిధులు మంజూరయ్యాయి. 2024 డిసెంబర్ 13న వంతెన పనుల పూర్తికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాగా, శంకుస్థాపన చేసి ఆరు నెలలు గడిచి మళ్లీ వర్షాలు ప్రారంభమైనా పనులు పూర్తికాలేదు. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెట్టి ఉంటే వానాకాలానికి ముందే పూర్తయ్యేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నెల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా అకాల వర్షాలతో వాగులోకి వరద నీరు చేరి పనులు నిలిచిపోయాయి.

రైతులకు భారం

పెద్దమావంది గ్రామానికి చెందిన రైతులకు వాగు అవతల 150 నుంచి 200 ఎకరాల సాగు భూము లుంటాయి. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు శ్రీనివాస్ నగర్, పట్టణంలోని ఆచన్‌పల్లి, పాండు ఫారం మీదుగా వెళ్లాలి. వంతెన పనుల పూర్తికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ బోధన్ సబ్ డివిజన్ డీఈ వెంకటేశ్‌ను వివరణ కోరగా, వాగులో వరద నీరు రావడంతో పనులు ముందుకు సాగడం లేదని చెప్పారు.

ఆరేళ్లుగా ఆర్థిక తోడ్పాటు లేదు

- నిలిచిన రాజీవ్ యువ వికాసం
- ఊసేలేని దళితబంధు.. సబ్సిడీ రుణాలు
- నామమాత్రంగా మారిన ఎస్సీ కార్పొరేషన్

నిజామాబాద్‌అర్బన్: రాజీవ్ యువ వికాసం ప్రారంభం కాలేదు.. దళిత బంధు నిలిచిపోయింది. సబ్సిడీ రుణాల ఊసే లేదు. ఆరేళ్లుగా ఆర్థికతోడ్పాటు లేక ఎస్సీలు నిరుత్సాహానికి లోనవుతుండగా, ఎస్సీ కార్పొరేషన్ నామమాత్రంగా మారింది. ఎస్సీల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రతి ఏడాడి అందించాల్సిన సబ్సిడీ రుణాలు గత ఐదేళ్లుగా నిలిచిపోయాయి.

సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జిల్లాలో ఎస్సీ జనాభా 2,17,267 (13.8శాతం) ఉంది. జిల్లా జనాభాలో 13.8శాతం ఎస్సీ జనాభా ఉంది. 2018 – 19 ఆర్థిక సంవత్సరంలో చివరి సారిగా జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందాయి. ప్రతి ఏడాది 300 నుంచి 400 మందికి ఉపాధి కల్పించేందుకు రూ.9 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. బ్యాంకు సమ్మతి ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేసింది. రూ.లక్షకు 60 శాతం, రూ.2 లక్షలకు వరకు 75 శాతం, రూ.10 లక్షల వరకు 50శాతం సబ్సిడీ అందించగా వందలాది మందికి లబ్ధి చేకూరింది. ఆ తరువాత నిధుల మంజూరు నిలిచిపోయింది. గత



కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి దళిత బంధు పథకము తీసుకొచ్చింది. మొదటి విడతలో 550 మందికి రూ.55 కోట్లతో వివిధ ఉపాధి అవకాశాలు కల్పించారు. రెండో విడత 660 దరఖాస్తులను స్వీకరించినప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి ఎలాంటి నిధులు విడుదల కావడం లేదు.

'ఉపాధి' కోసం ఎదురు చూపులు

ప్రభుత్వాలు తీసుకొచ్చే పథకాలను పక్కన పెట్టి కనీసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారానైనా రుణాలు అందిస్తే తమకు ఉపాధి లభిస్తుందని ఎస్సీ నిరుద్యోగులు అంటున్నారు. అటు దళిత బంధు, ఇటు ఎస్సీ కార్పొరేషన్ రెండు వైపుల నుంచి నిధులు లేకపోవడంతో 'ఉపాధి' కోసం ఎదురు చూపులు తప్పడం లేదంటున్నారు. పొట్టకూటి కోసం గల్ఫ్ బాట పట్టేలా తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తమను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే దళితబంధు అమలు చేయాలని, ఎన్నికల హామీ మేరకు ఆర్థికసాయాన్ని రూ.12 లక్షలకు పెంచాలని కోరుతున్నారు.

రుణాలు అందించాలి

కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏడాది ఇచ్చే సబ్సిడీ రుణాలను కొనసాగించాలి. తద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయంతోపాటు ఉపాధి దొరికింది. ప్రభుత్వం ప్రతి ఏటా రెండుసార్లు అవసరమైన నిధులను కేటాయించాలి. అప్పుడే ఎస్సీలకు ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుంది.



– మల్లాని శివ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఆదేశాలు వస్తేనే..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే రాజీవ్ యువ వికాసం ప్రారంభమవుతుంది. మిగతా రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇస్తే అలా అమలు చేస్తాం. ప్రస్తుతం నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. నిధులు మంజూరు కాగానే అందిస్తాం. దళిత బంధుపై సమాచారం లేదు.



– రమేశ్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆర్మూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ మెన్, వుమెన్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమానికి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు చండీగఢ్‌లో నిర్వహించనున్న నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగా మోహన్ చక్రు, మోహన్‌దాస్, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ రాజన్న, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి బాబన్న, కొక్కుల రమాకాంత్ పాల్గొన్నారు.



జాతీయస్థాయి కబడ్డీ పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

బోనస్ కోసం రైతుల నిరీక్షణ

■ మోర్తాడ్‌కు చెందిన రైతు కొప్పుల రాజశేఖర్ అతని కుటుంబసభ్యులు కలిసి స్థానిక సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో ఏప్రిల్ 24న 280 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యంను విక్రయించారు. ధాన్యం సొమ్ము వారం రోజుల వ్యవధిలో సంబంధిత రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. బోనస్‌కు సంబంధించి రూ.1.40 లక్షలు జమ కావాల్సి ఉండగా ఇప్పటి వరకూ నయాపైసా చెల్లింపులు జరుగలేదు.

■ ఏర్గట్లకు చెందిన రైతు ఉపేంద్ర 72 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అతనికి రూ.36వేల బోనస్ సొమ్ము జమ కావాల్సి ఉంది.

- కొనుగోళ్లు పూర్తయినా మొదలుకాని చెల్లింపులు
- నగదు కోసం ఎదురుచూపులు
- సన్నరకాల బోనస్‌ను చెల్లిస్తామని సర్కారు హామీ


మోర్తాడ్‌లో వరి తూకం వేస్తున్న కూలీలు

మోర్తాడ్(బాల్కొండ): బోనస్ వస్తుందనే ఆశతోనే యాసంగిలో సన్నరకాలను సాగు చేసిన రైతులు ఆ డబ్బులు చేతికి అందక నిరాశ చెందుతున్నారు. సన్నరకాల సాగును ప్రోత్సహించేందుకు ప్రతి క్వింటాలుకు రూ.500 ల బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం విదితమే. గత వానాకాలం సీజన్‌లో బోనస్ చెల్లించడంతో అదే ఉత్సాహంతో రైతులు యాసంగి సీజన్‌లోనూ సన్నరకాలనే సాగు చేశారు. దీంతో సన్నరకాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా రైతులకు 7,38,662 మెట్రిక్ టన్నుల సన్నరకాలకు సంబంధించిన రూ.369.33కోట్ల బోనస్ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి బోనస్ నిధులను వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు. బోనస్ సొమ్ము అందితే ప్రస్తుత సీజన్‌లో పంటల సాగుకు పెట్టుబడి కోసం దిక్కులు చూడాల్సిన అవసరం ఉందని చెప్తున్నారు.

ఎగ్గొట్టాలని చూస్తున్నారు



సన్నరకం వరి సాగు చేసిన రైతులను ప్రోత్సహిస్తామని నమ్మించిన ప్రభుత్వం ధాన్యం విక్రయించిన తర్వాత బోనస్ ఎగ్గొట్టాలని కుట్ర పన్నుతుంది. బోనస్ సొమ్ము అందితే వానాకాలం సీజన్ పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– పాపాయి పవన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మోర్తాడ్

రైతులను వంచించడం తగదు



బోనస్ చెల్లించకుండా రైతులను వంచించడం తగదు. రైతుభరోసా డబ్బులు చెల్లించి బోనస్ ఇవ్వకుండా చేతులు దులుపుకోవడం సరైంది కాదు. బోనస్ కచ్చితంగా చెల్లించాలి. లేకుంటే ఆందోళన తప్పదు.


– ఏనుగు రాజేశ్వర్, రైతు నాయకుడు, మోర్తాడ్

ప్రభుత్వానికి వివరాలు ఇచ్చాం

కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందించాం. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాగానే బోనస్‌కు సంబంధించిన సొమ్ము జమ అయ్యే అవకాశం ఉంది.

– అరవిందరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

23 దేశాల కరెన్సీ.. 25 దేశాల స్టాంప్స్ సేకరణ


గంగాధర్ దంపతులు సేకరించిన వివిధ దేశాల కరెన్సీ, నాణేలు



వివిధ దేశాల స్టాంపులు

- కాకతీయులు, నిజాం కాలం నాటి నాణేలు
- బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ గుట్ట గంగాధర్ దంపతులు



సేకరించిన నిజాం, కాకతీయుల కాలం నాటి నాణేలు


గంగాధర్, త్రివేణి దంపతులు

డిచ్‌పల్లి: అతడి వృత్తి పోలీసు.. ప్రవృత్తి వివిధ దేశాల నాణేలు.. కరెన్సీ, స్టాంపుల సేకరణ. ఈ సేకరణలో అతడి భార్య సహకారం ఎంతో ఉంది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు ఏడో బెటాలియన్‌లో గుట్ట గంగాధర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గంగాధర్ భార్య త్రివేణి గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఇద్దరికీ స్టాంపులు, నాణేలు, కరెన్సీల సేకరణ అంటే ఇష్టం. ఈ దంపతుల కుటుంబ సభ్యులలో పలువురు విదేశాలకు వలస వెళ్లారు. వారి ద్వారా అక్కడి దేశాల స్టాంపులు, నాణేలు, కరెన్సీ సేకరించారు. అలాగే స్నేహితులు, తెలిసిన వారి ద్వారా వివిధ దేశాల స్టాంపులు, నాణేలు, కరెన్సీ సేకరించారు. ఇలా 2003 నుంచి 23 దేశాల నాణేలు, కరెన్సీతో పాటు 25 దేశాలకు చెందిన స్టాంపులు సేకరించారు. సేకరించిన నాణేలలో కాకతీయుల కాలంతో పాటు 1939 సంవత్సరం నిజాం కాలం నాటి నాణేలు, రూపాయలు ఉన్నాయి. వీరు సేకరించిన నాణేలు, కరెన్సీలలో భారతదేశం తో పాటు యూఎస్‌ఏ, యూకే, మలేషియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, జోర్డాన్, టర్కీ, ఇటలీ, పోలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఖతర్, బహ్రెయిన్, యూఏఈ, కువైట్, సౌదీ అరేబియా తదితర దేశాలకు చెందినవి ఉన్నాయి. స్టాంపులలో ఇండియాతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, యూఎస్‌ఏ, యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, టర్కీ, మాల్టా, సింగపూర్, ఈజిప్ట్, ఫిలిప్పీన్స్, ఇటలీ తదితర దేశాలవి ఉన్నాయి. వీటి సేకరణ కోసం గంగాధర్ దంపతులు చాలా మంది వ్యక్తులను కలిశారు. పోలీసు ఉద్యోగం రాకముందు గంగాధర్ కూడా ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో ప్రైవేట్ టీచర్‌గా పని చేశారు. అప్పుడే ఆయనకు ఈ సేకరణపై ఇష్టం ఏర్పడింది. గత చరిత్ర, పాలకుల వైభవాలకు గుర్తు అయిన కాకతీయ, నిజాం కాలం నాటి నాణేల సేకరణతో మొదలుపెట్టాడు. ప్రస్తుతం తమ ఇంటికి ట్యూషన్‌కు వచ్చే బాల, బాలికలకు వీటి గురించి వివరిస్తారు.

● అ‘పూర్వ’ సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులు ఒకేచోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుసుమ బాల్‌కిషన్, సీహెచ్ వెంకటరాజయ్య, గోవింద్ లాల్, దిగంబర్, చంద్రకాంత్, యాద రమణారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

బోనం ఎత్తిన పోచారం



రుద్రూర్: మండల కేంద్రంలో బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బోనం ఎత్తుకుని ఊరేగింపు ప్రారంభించారు. కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు బోనాలను ఊరేగించి గ్రామ దేవతలకు సమర్పించారు.

రెండో టౌన్ ఎస్సైగా ముజాహిద్



ఖలీల్‌వాడి: నగరంలో రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ముజాహిద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా మావల పీఎస్ నుంచి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు పనిచేసిన ఎస్సై ఇమ్రాన్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

జిల్లాలో పౌర సన్మానం పొందిన ‘కోట’



నిజామాబాద్ రూరల్: విలక్షణ నటుడిగా పేరు పొందిన కోట శ్రీనివాస్‌కు ఇందూరు నగరంతో అనుబంధం ఉందని ప్రముఖ నాటక ప్రయోక్త శ్రీపాద కుమార శర్మ అన్నారు. అనారోగ్యంతో కోట శ్రీనివాస్ ఆదివారం మృతి చెందారని, ఆయన మృతి సినీరంగానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. 2012లో ఇందూరులో శ్రీపాద నాటక కళా పరిషత్ నాటక పోటీలు జరిగాయని వీటికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట శ్రీనివాస్‌రావును పౌర సన్మానం చేసినట్లు తెలిపారు. చిత్రపరిశ్రమ గొప్ప కళాకారుడిని కోల్పోయిందన్నారు విచారం వ్యక్తం చేశారు. చంద్రశేఖర శర్మ, వీపీ చందన్ రావు, సంస్కార భారతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సముద్రాల మధుసూదన చారి, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ ప్రేమ్‌లాల్ ఆయన మృతికి సంతాపం తెలిపారు.

బోధన్‌వాసికి స్వర్ణ కంకణ పురస్కారం



బోధన్‌టౌన్: జ్యోతిష్య శాస్త్రంలో విశేష కృషి చేస్తున్న బోధన వాస్తవ్యుడైన యోగిరాజ్ వైద్యకు స్వర్ణ కంకణ పురస్కారం లభించింది. ఆదివారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానసభలో తెలుగు సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు యోగిరాజ్‌కు స్వర్ణ కంకణ పురస్కారం అందించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరపండుగ






నగరంలో ఊరపండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఖిల్లా రామాలయం వద్ద నున్న శారదాంబ గద్దె నుంచి అమ్మవార్లు బయలు దేరాయి. కదిలొస్తున్న అమ్మవార్లను చూస్తూ తన్మయత్వంతో నగరవాసులు ‘పులోరియా’ అంటూ నినాదాలను హోరెత్తించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు, శివ సత్తుల పూనకాలతో నగరవీధులు హోరెత్తాయి.

– సాక్షి నెట్‌వర్క్


ఖిల్లా రామాలయం వద్ద ఉన్న శారదాంబ గద్దె వద్ద భక్తుల సందడి


పోతరాజులతో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్, నరాల సుధాకర్


పోతరాజులతో ఎమ్మెల్యే ధన్‌పాల్






అమ్మవార్లకు మొక్కుతున్న భక్తులు



క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



తాడ్వాయి: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బీర్ల సిద్ధయ్య(44) కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్లగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని రుద్రారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రుద్రారం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.4500 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్ తండాకు చెందిన బాదావత్ పీర్ సింగ్ అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సుస్మిత ఆదివారం తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న కంటెయినర్


ప్రమాదానికి కారణమైన కంటెయినర్


దేవేంద్రసింగ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

డిచ్‌పల్లి: ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటెయినర్ ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్ స్వల్పగాయాల పాలైయ్యాడు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరు నుంచి మోటారు బైక్‌ల లోడ్‌తో మధ్యప్రదేశ్‌కు కంటెయినర్ వెళ్తోంది. డిచ్‌పల్లి నాగ్‌పూర్ గేటు వంతెన మూలమలుపు వద్ద మోటారు బైక్‌ల లోడ్‌తో ఉన్న పెద్ద ట్రక్కు క్యాబిన్ ఎడమ వైపు అద్దం పగిలిపోవడంతో డ్రైవర్ రోడ్డుపక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో బెంగుళూరు నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న కంటెయినర్ డ్రైవర్ నిద్రమత్తులో నిలిపి ఉన్న ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కంటెయినర్ అదుపుతప్పి డివైడర్ పై నుంచి అవతలి పక్కకు దూసుకెళ్లి పక్కనున్న బారికేడ్‌ను ఢీకొని నిలిచిపోయింది. కంటెయినర్‌లో ఇద్దరు డ్రైవర్లు ఉండగా ఆ సమయంలో ఓంప్రకాష్ నడుపుతున్నాడు. ప్రమాదం జరిగినప్పుడు క్యాబిన్ ఎడమవైపు డోర్ ధ్వంసం కావడంతో అటువైపు కూర్చున్న మరో డ్రైవర్ దేవేంద్రసింగ్(45) అందులోంచి కిందపడగా కంటెయినర్ టైర్లు అతడిపై నుంచి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంప్రకాశ్, దేవేంద్రసింగ్ ఇద్దరు అన్నదమ్ములు.. రాజస్తాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన వారు. ఓంప్రకాశ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్మూర్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్లే రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో మరో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. లేదంటే డివైడర్ పై నుంచి అటువైపు దూసుకెళ్లిన కంటెయినర్ కు ఢీకొని మరో ప్రమాదం జరిగి ఉండేది. సమాచారం అందుకున్న ఎస్సై షరీఫ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దేవేంద్రసింగ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్ ఓంప్రకాశ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆగి ఉన్న ట్రక్కులోని వారికి ఏమీ కాలేదు. ట్రక్కు వెనకభాగంలో కంటెయినర్ ఢీకొట్టడంతో అందులో ఉన్న కొన్ని మోటారు బైకులు దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగు పనుల్లో భోజన విరామం



భిక్కనూరు: మండలంలో వర్షకాల వ్యవసాయ సాగు పనుల జోరుగా కొనసాగుతున్నాయి. పనుల్లో మహిళ కూలీలు, రైతులు అధికంగా హాజరవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు కొనసాగుతుండటంతో వారు మధ్యాహ్న భోజనాన్ని సద్దులు కట్టుకొని, పని ప్రదేశాల్లోనే భోజనం చేస్తున్నారు. భిక్కనూరు మండల కేంద్రం సమీపంలో మహిళ వ్యవసాయ కూలీలు వరి నాట్లు వేసి, మధ్యాహ్నం పొలం గట్టు పక్కన ఉన్న రోడ్డుపై కూర్చుండి భోజనం చేశారు. తోటివారితో ముచ్చట్లు పెట్టుకుంటూ పని అలసటను మర్చిపోయారు. ఈ చిత్రాన్ని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.